నేటి నుంచి ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు

- 6న మల్లికార్జునస్వామి కల్యాణం
- మూడురోజుల పాటు వేడుకలు



మల్లికార్జునస్వామి



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం

ఓదెల: జిల్లాలోని ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు దూపం వీరభద్రయ్య, పూజారుల సమక్షంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. బుధవారం ఉదయం10:30గంటలకు భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తారు. మంగళవారం శ్రీమహా గణపతిపూజ, గౌరీపూజ, శివపుణ్యాహజచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, హారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద కార్యక్రమాలు జరుగుతాయి. 8న జరిగే మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి 7 వరకు నిత్యోత్సవం, 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సామూహిక రుద్రాభిషేకం, రాత్రి 8గంటలకు రథోత్సవం, 11:45నిమిషాలకు లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం మహాహారతి మంత్రపుష్పం తీర్థప్రసాద కార్యక్రమాలు జరుగుతాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో 5నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. దూర ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం.

– బి.సదయ్య, ఆలయ ఈవో

ఆలయం ముస్తాబు



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం నుంచి శుక్రవారం వరకు జరిగే బ్రహ్మోత్సవాలతో పాటు మహాశివరాత్రి వరకు జరిగే ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశాం. నీడ, మంచినీటి, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశాం.

– మేకల మల్లేశంయాదవ్, ఆలయ చైర్మన్

వైభవంగా జరుగుతాయి



ఓదెల మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. స్వామివారి కల్యాణోత్సవం, మహాశివరాత్రి జాగరణ కార్యక్రమాలు కనుల పండువగా జరుగుతాయి. ఒగ్గుపూజారులు స్వామివారికి పట్నాలతో పాటు బోనాలు వేస్తారు.

– మొగిలి సంపత్, ఒగ్గుపూజారుల సంఘం ప్రతినిధి

క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ ఇస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు మల్లయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1,25,000 విలువ గల ఎల్‌వోసీని సోమవారం ఎమ్మెల్యే విజయరమణారావు మల్లయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని శ్రీమహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జపాన్ షిటోరియో కరాటే స్కూల్ స్టేట్ చీఫ్ అండ్ బెల్ట్ ఎగ్జామినర్ కరాటే శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్ట్‌ల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి జపాన్ షిటో–రియో కరాటే స్కూల్ స్టేట్ ప్రెసిడెంట్ తగరపు శంకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారి విఠల్‌కుమార్, కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేశ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొటం సతీశ్, టీబీజీకేఎస్ కేంద్ర కోశాధికారి వెంకటేశ్, ఫిజికల్ ట్రైనర్ రేడియం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి



ఇంటి పన్ను వసూలు చేస్తున్న కమిషనర్

పెద్దపల్లిరూరల్: పట్టణ పరిధిలో ఉన్న ఇంటి యజమానులు సకాలంలో ఇంటిపన్నులు చెల్లించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ కోరారు. పెద్దపల్లిలో సోమవారం ఇంటి పన్ను వసూళ్ల తీరును మేనేజర్ శివప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్సుల ఫీజు చెల్లించాలని కోరారు. ఇప్పటికే బకాయి ఉన్న పన్నులను సైతం 90శాతం వడ్డీ రాయితీతో చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిల్‌కలెక్టర్ రాజేందర్ ఉన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

గోదావరిఖని: నగరంలోని జీడీకే–1వ గని నుంచి జీడీకే–టూ ఇంక్లయిన్ వరకు ఉన్న రోడ్డు ప్రమాదకరంగా మారిందని టీఎస్‌టీయూసీ నాయకులు అన్నారు. సోమవారం ఆర్జీ–1 డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడ్డారని వాపోయారు. జనగామకు వెళ్లి వచ్చే ప్రజలకు, స్కూలు పిల్లలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. యుద్ధ ప్రతిపాదికన రోడ్డు నిర్మాణంతో పాటు క్వార్టర్లకు సెంట్రల్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. నాయకులు ఏడుకొండలు, ముదిగంటి దామోదర్‌రెడ్డి, సల్ల రవీందర్ పెగడపల్లి రాజనర్సు, చిటికెల రాజలింగు, కంది చంద్రయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ధర్మారం: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న తమకు వేతనాల చెల్లింపులో జాప్యం చేయడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని వెంటనే తమ జీతాలు చెల్లించాలని కోరుతూ సోమవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామపంచాయతీల్లో 5నెలల నుంచి జీతాలు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సమ్మె కాలంలో ఇవ్వాల్సిన జీతాలు సైతం ఇప్పటి వరకు రాలేదని వాపోయారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్, మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



పరుగు పందెంలో పాల్గొన్న మహిళలు

గోదావరిఖని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక గోదావరి కళా ప్రాంగణంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్జీ–1 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. సేవా సమితి అధ్యక్షురాలు చింతల లక్ష్మి పోటీలు ప్రారంభించారు. మ్యూజికల్ చైర్, బాంబ్ బ్లాస్ట్, త్రోబాల్, లెమెన్ ఇన్ స్పూన్ ఆటలు ఆటకట్టుకున్నాయి.

రామగుండంలోని ఎస్‌టీపీ సందర్శన



ఎస్‌టీపీ పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్

రామగుండం: ఇళ్ల నుంచి వెలువడే డ్రైనేజీ, వ్యర్థ జలాలు నేరుగా నదుల్లోకి చేరుతుండడంతో జలాలు కలుషితం అవుతున్నాయని, వాటిని శుద్ధీకరించడం కోసమే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని పాత బజార్‌లో స్థాపించిన ఎస్‌టీపీని సోమవారం బల్దియా కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సందర్శించారు. శుద్ధి జరుగుతున్న తీరును పరిశీలించి స్థానికంగా అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామగుండం పట్టణ పరిధిలోని ప్రయివేట్ గృహాలతో పాటు జెన్‌కో క్వార్టర్ల నుంచి వెలువడే రా వ్యర్థ జలాలు పాతబజార్‌లోని ఎస్‌టీపీకి చేరుతుందని, అక్కడ ప్రతీరోజు 4 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) సామర్థ్యం గల సీవరేజీ వాటర్‌ను ఇక్కడ ట్రీట్‌మెంట్ చేసి శుద్ధి చేసిన జలాలను సమీపంలోని చెరువులు, కుంటలు, నదుల్లోకి వదులుతారు. సీవరేజీ వాటర్ ట్రీట్‌మెంట్ దశలను పరిశీలించి కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూముల క్షేత్ర సందర్శన

సాక్షి ఎఫెక్ట్



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల, విసంపేట గ్రామాల శివారులో ఉన్న ప్రభుత్వ భూముల్లో కొంత మంది కబ్జాదారులు యథేచ్ఛగా సాగు చేస్తుండడంపై సోమవారం అంతర్గాం తహసీల్దార్ పనకంటి రామ్మోహన్‌రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ భూముల్లో పాగా' శీర్షికతో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ యంత్రాంగం కదిలొచ్చింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసి సాగుకు యోగ్యంగా తీర్చిదిద్దుతున్న వారి వివరాలను సేకరించాలని కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. తహసీల్దార్‌తో రెవెన్యూ పరిశీలకులు శ్రీధర్ ఉన్నారు.

గోదావరి తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టండి



వినతిపత్రం అందజేస్తున్న బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరి తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, సహ కార్యదర్శి కొండపర్తి లింగన్న సంపత్, ప్రతినిధులు దిగంబర్ సహసంయోజక్, అరవింద్, ఆరెల్లి జలంధర్, చక్రపాణి, బాలు, అనిల్ కిరణ్, సురేశ్, కార్తీక్, తిరుపతి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



రాస్తారోకోను అడ్డుకుంటున్న పోలీసులు

సుల్తానాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు ఏమైందని బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్ ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీరాంపూర్ క్రాస్ రోడ్ వద్ద ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అరగంటకు పైగా రాసారోకో చేయడంతో పోలీసులు వచ్చి రాస్తారోకో విరమింపజేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. బీజేపీ సీనియర్ నాయకులు సంతోష్, కుమార్‌రెడ్డి, సాయి, కందుల శ్రీనివాస్, ఆకుల లక్ష్మణ్, భూసారపు సంపత్, తిరుపతి, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ శారద

రామగిరి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ ఆరెల్లి దేవక్క ప్రారంభించారు. ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేయని వాళ్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు దరఖాస్తులు సమర్పించగా జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, ఎంపీడీవో శైలజారాణిలతో కలిసి ఎంపీపీ దరఖాస్తులు స్వీకరించారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించడానికి సోమవారం కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో దేవరకొండ ఉమేశ్ తెలిపారు.

పథకాలు ప్రజలకు చేరవేసేందుకే..

సుల్తానాబాద్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులకు అందించేందుకే ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌ను ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌ను ప్రారంభించారు.

సేవా కేంద్రం ఏర్పాటు

సుల్తానాబాద్: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలుపై మండల పరిషత్ కార్యాలయంలో సేవా కేంద్రాన్ని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఏర్పాటు చేశారు. సోమవారం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



టపాసులు పేల్చుతున్న నాయకులు

గోదావరిఖని: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించడంతో గోదావరిఖనిలో బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం సంబరాలు నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో టపాసులు పేల్చి సీట్లు పంచిపెట్టారు. నాయకులు పీటీస్వామి, పెంట రాజేశ్, నూతి తిరుపతి, పిల్లి రమేశ్, అచ్చె వేణు, మొగిలి, తోకల రమేశ్, ఇంజపురి నవీన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

సుల్తానాబాద్: ఏడో జాతీయ కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి హర్షవర్ధన్ బంగారు పతకం సాధించడంతో ప్రిన్సిపాల్ కృష్ణప్రియ సోమవారం అభినందించారు. 3వ తేదీ ఆదివారం మంచిర్యాల జిల్లా మందమర్రిలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో హర్షవర్ధన్ బంగారు పతకాలు సాధించాడని ఆయన తెలిపారు. ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్ విద్యార్థిని అభినందించారు.

మహిళలకు ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్.అలివేణి

రామగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్జీ–3 డివిజన్‌లోని సెంటనరీకాలనీ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. కాగా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు ఎన్.అలివేణి, కె.విజయలక్ష్మి ప్రారంభించారు. లేడీస్ క్లబ్ కార్యదర్శి సీ.హెచ్.గీతారాణి, కమిటీ సభ్యులు హరిణి, ప్రసన్న, లావణ్య, నిఖిత, కోమలి పాల్గొన్నారు.

పెద్దపల్లిలో మాదిగలకే అవకాశం ఇవ్వండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి మాదిగలకే పోటీచేసే అవకాశం కల్పించాలని మాదిగ ఐక్య వేదిక నాయకులు అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం నుంచి పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డప్పుల చప్పుళ్లతో చాటింపుయాత్ర నిర్వహించారు. ప్రగతినగర్, అమర్‌నగర్, మెయిన్‌రోడ్డు మీదుగా జెండా కూడలి వరకు యాత్ర చేరుకుంది. మాదిగ ఐక్య వేదిక నాయకులు మామిడిపల్లి బాపయ్య, కవ్వంపల్లి ప్రభాకర్, కోటగిరి పాపయ్య, పల్లె సదానందం, కట్కూరి సందీప్, రేగుంట సునీల్, మంథని మల్లేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జ్యోతినగర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగం హెడ్‌కానిస్టేబుల్ అట్టెం శంకర్ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు సైబర్ క్రైమ్స్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కానిస్టేబుల్స్, కుమార్, శ్రీనివాస్, శ్రీనివాసు, ప్రశాంత్, ఆటోడ్రైవర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఖరారు..

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రైవేట్ ఆసుపత్రుల మార్కెటింగ్ సంఘ కార్యవర్గ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంగుల రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా చాటకోళ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అడప సంతోష్‌కుమార్, కోశాధికారి రాపెల్లి రాజ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా ఈదునూరి సాగర్ ఎన్నికయ్యారు.

శివగట్టు మల్లన్న పోస్టర్ ఆవిష్కరణ

ఓదెల: మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో జరిగే శివగట్టు మల్లన్న జాతర పోస్టర్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వేర్వేరుగా శివపల్లి, పెద్దపల్లిలో సోమవారం ఆవిష్కరించారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే శివగట్టు మల్లన్న ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కోరారు.

పెద్దపల్లి పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం

గోదావరిఖని: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రకటించడంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. గులాబీ సైనికులంతా పార్టీ గెలుపుకోసం కృషి చేయాలన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

జూలపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల లోపు కరెంటు బిల్లు మాఫీ రానివారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌ను ఎంపీడీవో పద్మజతో కలిసి ప్రారంభించారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యర్థాలు తరలింపు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో యూరియా, అమ్మోనియా ఉత్పత్తిలో విడుదలైన 7.3 టన్నుల రసాయన ఈటీపీ బురద వ్యర్థాలను టెండర్ ద్వారా హైదరాబాద్ దుండిగల్ డంప్‌యార్డ్‌కు తరలించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి గుర్తింపు పొందిన సంస్థ ద్వారా ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యర్థాలను తొలగించామని అధికారులు తెలిపారు.

ఐదో డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యదర్శి మొహ్మద్ రహీం సోమవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రామగిరి: మండలంలోని బేగంపేట గ్రామపంచాయతీలో సీసీరోడ్ల నిర్మాణానికి సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్నతో కలిసి ఎంపీపీ ఆరెల్లి దేవక్క భూమిపూజ చేశారు.

హాస్టల్ విద్యార్థులకు ఎలర్జీ సమస్య

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్‌లో ఉన్న జ్యోతిరావుపూలే గురుకుల హాస్టల్‌లో విద్యార్థులకు ఎలర్జీ సమస్యలు తీవ్రం కావడంతో ఆస్పత్రికి తరలించారు. సోమవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి హాస్టల్ ఉద్యోగి వెంట తీసుకొని పరీక్షలు చేయించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ముత్తారం: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో లలిత ఆదేశించారు. సోమవారం ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇంటింటా పోలియో చుక్కల పంపిణీ

ఎలిగేడు: మండలంలో 12 గ్రామాల్లో సిబ్బంది ఇంటింటా తిరుగుతూ పోలియో చుక్కలు వేయని 25 మంది చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేసినట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టినా తెలిపారు.

సెల్‌ఫోన్‌లు అప్పగింత

రామగిరి: మండలంలోని లద్నాపూర్‌కు చెందిన షేక్ జమీల్, నల్లూరి సతీశ్ తమ ఫోన్‌లు ఎక్కడో పడిపోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఎస్సై కాట్రేవు సందీప్ దొరికిన ఫోన్లను బాధితులకు అందజేశారు.

అయోధ్య భక్తులకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న జెడ్పీటీసీ సంధ్యారాణి

రామగుండం: తక్కువ ఖర్చుతో అయోధ్య రామయ్యను దర్శించుకునే భాగ్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కల్పిస్తున్నారని పాలకుర్తి జెడ్పీటీసీ, బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు అయోధ్య రాముడిని దర్శించుకుని ఆదివారం అర్ధరాత్రి రామగుండం చేరుకున్న భక్తులకు రామగుండం రైల్వేస్టేషన్‌లో మంగళహారతులతో స్వాగతం పలికి మాట్లాడారు. జనగామ శివరాం, చిలువేరు కుమార్, బర్పటి నారాయణ, పైతరి రాజు, గోపగాని నవీన్‌గౌడ్, పవన్, రాకేశ్, సుమంత్ పటేల్, వినయ్, హర్ష, మంజునాథ్, శ్రీకాంత్, వంశీ ఉన్నారు.

స్కూల్ విద్యార్థులకు బ్యాగుల అందజేత



బ్యాగులు అందజేస్తున్న గంట వెంకటరమణారెడ్డి

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి స్కూల్ బ్యాగులు అందజేశారు. గ్రామానికి చెందిన గుండా సుధాకర్ కుమార్తెలు మౌనిక, మానస విదేశాల్లో నివాస ముంటున్నారు. తాము చదువుకున్న పాఠశాలపై మమకారంతో దాదాపు రూ.35వేల విలువైన స్కూల్ బ్యాగ్స్ విద్యార్థులకు పంపించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేముకనకయ్య, కొలిపాక సత్తయ్య, గుండా శంకర్‌లింగం, వీరబోయిన రాజమౌళి, దొంతుల సురేశ్, ఆసం రాజు, బూస కనకయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తాటి చెట్టుపై నుంచి జారిపడి ఒకరికి గాయాలు

పెద్దపల్లిరూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ వెంకటేశం అనే గీత కార్మికుడు సోమవారం తాటిచెట్టుపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కల్లు గీసేందుకు చెట్టుపైకి ఎక్కుతుండగా జారిపడడంతో గాయపడ్డ వెంకటేశంను స్థానికులు చికిత్స నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

గడ్డివాము దగ్ధం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలో సోమవారం పన్నూరు శంకర్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్ ఇంటి వెనకాల ఉన్న దాదాపు 8ట్రాక్టర్ల గడ్డిలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ రావడానికి కొంత ఆలస్యం అవుతుందని చుట్టుపక్కల వారు మోటార్లు పెట్టి మంటలు ఆర్పడం ప్రారంభించారు. ఇంతలోనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.50వేల విలువగల గడ్డి పూర్తిగా దగ్ధమైనట్లు శంకర్ వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

సుల్తానాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కల వేసినట్లు పోలియో డ్రాప్స్ రాష్ట్ర టీం సభ్యులు గోపికృష్ణ అన్నారు. సోమవారం ఇంటింటా పోలియో డ్రాప్స్ కార్యక్రమంలో భాగంగా ఆయన పలు ప్రాంతాలను సందర్శించారు. ఇటుక బట్టీలు, పరిశ్రమలలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారా అని ఇంటి యజమానులను ఆరా తీశారు. జీరో నుంచి 5సంవత్సరాల పిల్లలు తప్పనిసరిగా వేయించుకునేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ అనుదీప్, హెచ్‌వీలు రోజా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి

జూలపల్లి: మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ యూత్ మండల మాజీ అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి తహసీల్దారు బషీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజల ఇబ్బందులను గమనించి వెంటనే ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఆయన విన్నవించారు. నాయకులు గండు సంజీవ్, దేవేందర్‌రెడ్డి, అమరగాని సాయి, నెరువట్ల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ ఎదుట శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



శుభ్రం చేయిస్తున్న సూజర్‌వైజర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ అధికారులు సోమవారం గోదావరిఖని బస్టాండ్ ఎదుట శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు జేబీసీ వాహనంతోపాటు అదనపు సిబ్బంది సేవలు ఉపయోగించుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే మున్సిపల్ ఆఫీసు టీజంక్షన్ నుంచి బస్టాండ్ వరకు చెత్తా చెదారం తొలగించడంతోపాటు రోడుపక్కన బండరాళ్లను తొలగించి చదును చేశారు. స్థానిక పారిశుధ్య సేవకుల ఫోన్ నంబర్ ముద్రించిన కరపత్రాలను వ్యాపారస్తులకు అందజేశారు. ఇక నుంచి చెత్త బయట వేసిన వారికి జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.